క్లుప్తంగా

డీఆర్వోకు వినతి



నెల్లూరురూరల్ : నగరంలోని కలెక్టరేట్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌కు విశ్వహిందూ పరిషత్ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న హింసాకాండను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. వీహెచ్‌పీ నాయకులు ఏవీఆర్ మోహన్‌రావు, శ్రీధర్, రాజేంద్రప్రసాద్, గోపినాథ్, అన్నపూర్ణమ్మ, సురేష్‌బాబు ఉన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్సీ అభినందన



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): జేఈఈ మెయిన్‌లో జాతీయ స్థాయిలో 274వ ర్యాంక్ సాధించిన కృష్ణచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి నిర్మల్‌తేజను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా నిర్మల్‌తేజకు రూ.లక్షను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు.

మెరిట్ ప్రాతిపదికన ప్రకటించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నేతలు

నెల్లూరు (టౌన్) : ఎస్సీ వర్గాలకు చెందిన హెడ్‌మాస్టరు, టీచర్ల పేర్లకు ఎదురుగా వారి ఉపకులాలను సూచిస్తూ రివైజ్డ్ సీనియారిటీ లిస్టును మెరిట్ ప్రాతిపదికన ప్రకటించాలని మహాజన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చేమూరు మస్తాన్‌మాదిగ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును శనివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాలో ఎస్సీ, హెడ్‌మాస్టరు, ఉపాధ్యాయుల కులాలను కేవలం ఎస్సీగా ప్రకటించడం వల్ల ఎవరూ ఏ ఉపకులమో అర్థం కావడం లేదన్నారు. హెడ్‌మాస్టరు పోస్టులను లెక్కించే క్రమంలో అన్ని మంజూరు పోస్టులు, అప్‌గ్రేడ్ హెచ్ఎం పోస్టులను కలిపి ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడు శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూసి అడిక్వసీ లెక్కించాలని కోరుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య పాల్గొన్నారు.

23న ఘంటసాల గాన నీరాజనం

నెల్లూరు(బృందావనం) : పుర మందిరంలో ఈనెల 23న ఘంటసాల 51వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు గాయకుడు కోడూరు ఆనంద్‌రావు శనివారం తెలిపారు. ఘంటసాల కళానికేతన్ ఆధ్వర్యంలో తొలుత గాన నీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కళాకారులు, గాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేత్రదానం

నెల్లూరురూరల్ : జిల్లాలోని కందుకూరు సంతోష్‌నగర్‌కు చెందిన అమర వెంట విశ్వనాథ్ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబసభ్యుల అంగీకారంతో శనివారం నెల్లూరు పెద్దాస్పత్రికి దానం చేశారు. కందుకూరు రెడ్‌క్రాస్ చైర్మన్ చెన్న వెంకట రామాంజనేయులు సహకారంతో కుటుంబసభ్యులు అమర ఝాన్సీలక్ష్మి అంగీకారంతో ప్రభుత్వ వైద్యశాలకు అందజేశారు. ఈ నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సునీల్ సేకరించి అనంతరం సర్టిఫికెట్‌ను అందించారు.

రైతులకు అవగాహన కల్పించాలి



నెల్లూరు (పొగతోట) : ఉపాధిహామీ ద్వారా ప్లాంటేషన్ కార్యక్రమాల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ గంగాభవాని మండలాధికారులను ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో హార్టికల్చర్ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ మీటింగ్ శనివారం నిర్వహించారు. హార్టికల్చర్‌కు సంబంధించి నిమ్మ, బత్తాయి తోటల్లో చెట్లను సాగుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. విధి విధానాలకు సంబంధించి త్వరలో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

గుర్తింపు లేని వ్యక్తికి కీలక బాధ్యతలా?

- కమిషనర్ వద్ద పనులు చక్కబెడుతున్న వైనం
- ఎన్ఎంసీ కార్యాలయం వింత వైఖరి
- నియామకంపైనే సిబ్బంది సందేహాలు



శ్రావణ్ వాడుతున్న కారుకు ఎన్ఎంసీ స్టిక్కర్

నెల్లూరు(బారకాసు) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శ్రావణ్ అనే వ్యక్తి కమిషనర్ వద్ద అనధికారికంగా కీలకమైన బాధ్యతలు నిర్వరిస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇతను కాంట్రాక్ట్ పద్ధతిలో కానీ, ఆప్కాస్ ద్వారా కానీ, ఔట్‌సోర్సింగ్ ద్వారా కానీ నియమితులు కాలేదు.

కీలక విధుల నిర్వహణ

ఎన్ఎంసీ కార్యాలయ పరిపాలన పరంగా ఉన్నతాధికారులకు సమర్పించే నివేదికలు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి షోకాజ్ నోటీసులు, కార్యాలయ అంతర్గత బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు, అక్రమ భవన నిర్మాణాలకు సంబంధించిన నోటీసులు ఇలా కీలకమైన లెటర్స్ టైప్ చేసి సిద్ధం చేసే బాధ్యత శ్రావణ్‌కు అప్పగించడం విమర్శలకు దారితీస్తోంది. ఎన్ఎంసీ కార్యాలయంలో ఒకరిని నియమించుకోవాలంటే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ ద్వారా జరగాలి. లేదా కార్యాలయానికి అవసరమైన సేవలు అందించేందుకు ఎవరినైనా నియమించుకునే అవకాశం ఉంటుంది. అది కూడా స్టాండింగ్ కమిటీలోనూ, లేక కౌన్సిల్‌లోనూ ఈ అంశాన్ని పెట్టి అందరి ఆమోదంతో నియమించుకోవాల్సి ఉంది. కానీ శ్రావణ్‌ను ఎలాంటి ఆమోదం లేకుండా ఎలా నియమించుకున్నారు? అతనికి ఏ విధంగా నెలనెలా జీతం ఇస్తున్నారో అంతుబట్టడం లేదు.

ఆర్డీఓ కార్యాలయం నుంచి ఎన్ఎంసీకి

శ్రావణ్‌ను ఏడాది క్రితం ఎన్నికల సమయంలో ఆర్డీఓ కార్యాలయంలో కొద్దిరోజుల పాటు తాత్కాలికంగా రోజువారీ వేతనంపై కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించుకున్నారు. ఎన్నికల అనంతరం అతన్ని నిలిపివేశారు. తాను కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తానని నమ్మబలికి ఆ ప్రకారంగా ఎన్ఎంసీ కార్యాలయంలో చేరినట్లు సమాచారం. ఇప్పుడు అతను కార్యాలయానికి కారులో వస్తున్నారు. కారుకు ఎన్ఎంసీ స్టిక్కర్‌ను వేసుకుని తిరుతున్నారు.

చర్యలు తీసుకోకుంటే ప్రమాదమే..

కొన్నికొన్ని సందర్భాల్లో రహస్యంగా నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ రహస్యంగా నివేదికలను శ్రావణ్ ద్వారా బయటకు తెలిసిపోతే ఎవరు బాధ్యత వహించాలి? ఇంతటి కీలకమైన పనిని అతనికి ఎందుకు అప్పగించారో ఎవరికీ అంతుపట్టని విషయం. ఈ విషయంపై అదనపు కమిషనర్‌ను వివరణ కోరగా అతను ఎన్ఎంసీ కార్యాలయంలో నియమితుడయ్యాడనే విషయం తనకు తెలియదని, మేనేజర్‌ను అడిగి తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటానని సమాధానమిచ్చారు.

వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల డిమాండ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : వక్ఫ్ చట్ట సవరణను వెంటనే ఉపసంహరించుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం పలు రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, సీపీఐ నాయకుడు రామరాజులు హాజరై, మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ద్వారా దేశ ప్రజలను రెండుగా చీల్చే కుట్ర చేస్తోందన్నారు. ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులో చేర్పించడం సరికాదన్నారు. ముస్లింల హక్కులను కాలరాసే విధంగా ఈ చట్టం ఉందన్నారు. వక్ఫ్ ఆస్తులపై పట్టు సాధించేందుకే బీజేపీ ప్రభుత్వం ఇలాంటి చట్టాలను చేసిందని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని బీవీ నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, కొండాయపాళెం, వనంతోపు సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(బృందావనం) : హరనాథపురంలోని కేర్ హ్యాండ్స్ వృద్ధాశ్రమంలో రూత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. రూత్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక డైరెక్టర్, అడ్వొకేట్ ఫిలిక్స్ రాజ్‌కమల్, డాక్టర్ లక్ష్మీబాయి, భువన తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీఓ

నెల్లూరు సిటీ : వేసవి నేపథ్యంలో రూరల్ మండలంలోని పంచాయతీల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బూడిద విజయకుమార్‌యాదవ్, ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో రాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలను దొంగలించే అవకాశం ఉందని, రైతులు కూడా పరిశీలిస్తుండాలని సూచించారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యుత్, తాగునీరు, పారిశుధ్యంపై ఎప్పటికప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలిపిన వెంటనే పరిష్కరించాలన్నారు. అటవీశాఖ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ దేవరపాళెంలో 1.5 లక్షల మొక్కలు, నగర వనానికి 50 వేల మొక్కలను జూలైలో ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వన్యప్రాణులను బోన్ల ద్వారా చంపకుండా రైతులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దేవసేనమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యుడు మీరా మొహిద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నేడు



చెస్ టోర్నీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుమన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జిల్లా చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20న ముత్తుకూరు రోడ్డులోని పార్వతీనగర్‌లో ఉన్న సిల్వర్‌ఓక్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. ఈ మేరకు స్కూల్‌లో టోర్నీ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ ప్రోత్సాహకంగా నగదు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తున్నామన్నారు. వివిధ వయో విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వివరాల కోసం డాక్టర్ మధుసూదన్‌రెడ్డి నంబరు 62815 80209ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా ‘రన్ ఫర్ జీసస్’



నెల్లూరు(బృందావనం) : నగరంలో నిర్వహించిన ‘రన్ ఫర్ జీసస్’ ర్యాలీలో క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ఏబీఎం కాంపౌండ్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీలో క్రైస్తవులు భక్తి గీతాలను పాడుకొంటూ కనకమహల్ మీదుగా గాంధీబొమ్మ సెంటర్, వీఆర్సీ సెంటర్, మద్రాస్ బస్టాండ్, ఫత్తేఖాన్‌పేట మీదుగా బట్వాడిపాళెం సెంటర్ వరకు చేపట్టారు. కన్వీనర్లు రెవ.డేవిడ్ దయాసాగర్, బ్రదర్ జానీజో, రెవ డాక్టర్ రాజశేఖర్ దాసరి, ఉరందూరు సురేంద్రబాబు, రెవ హరిపాల్, బర్నాబాస్, మహేష్, సతీష్, సంజయ్, సాయి పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు సిటీ : ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని రూరల్‌లోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో టీడీపీ నాయకులు శనివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వీపీఆర్ ఫౌండేషన్, టీడీపీ నేతలు మొత్తం 1,260 యూనిట్ల రక్త సేకరణ చేశారు. కార్యక్రమంలో దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, వంశీరెడ్డి, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

ముస్లింలకు అండగా నిలిచిన వైఎస్ జగన్



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

- కృతజ్ఞతలు తెలిపిన మైనారిటీ నాయకులు

నెల్లూరు సిటీ : వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సమాజానికి అండగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రూరల్ నియోజకవర్గ మైనారిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. చింతారెడ్డిపాళెంలోని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నివాసంలో వారు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి అబ్దుల్ సలీం, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు షేక్.సిద్దిక్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీలు వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. ముస్లిం సమాజానికి అండగా నిలిచి, సుప్రీంకోర్టులో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ డాక్టర్ సత్తార్, మైనారిటీ నాయకులు మహమ్మద్ ఇక్బాల్, ఖాదర్‌బాషా, రసూల్, జాకీర్, జుబేర్, ముజాఫర్, జిలాని, అలిమ్, ఆరిఫ్, ఇలియాజ్, హమీద్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా రాణించాలి



విద్యార్థులతో మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు) : ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని మేయర్ స్రవంతి ఆకాంక్షించారు. నగరంలోని మున్సిపల్ జూనియర్ కళాశాల సీనియర్ ఎంపీసీలో సుహర్ధి 974, హేమంత్ 964 సాధించగా, సీనియర్ బైపీసీలో రమ్య 978, సౌమ్య 946, కల్పన 933 మార్కులు సాధించారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో 470కు అర్షియా 458 మార్కులు, జయశ్రీ 453, హసీద్ 450, ఈశ్వర్ 446 మార్కులు సాధించారు. ఈ క్రమంలో వారిని నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో శనివారం కలిసి అభినందనలు తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కాలేయాన్ని కాపాడుకోవాలి

నెల్లూరురూరల్ : శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కాలేయమని, దీనిని కాపాడుకుని జీవితాన్ని రక్షించుకోవాలని మెడికవర్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన శనివారం మాట్లాడారు. సరైన జాగ్రత్తలు, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ–వ్యర్థాలు హానికరం

- ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : ఈ–వ్యర్థాలు ఆరోగ్యానికి హానికరమని ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో 57 కంప్యూటర్ మానిటర్లు, 69 హార్డ్‌డిస్క్‌లు తొలగించిన సీపీయూలు, 26 కీబోర్డులు, 14 ప్రింటర్లు, తొమ్మిది స్టేబల్ లైజర్లు, 25 కాట్రిడ్జ్‌లను ఈ–వ్యర్థాలుగా శనివారం నిర్ధారించారు. వాటిని శాస్త్రీయ పద్ధతిలో ఎలా డిస్పోజ్ చేయాలనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ–వ్యర్థాల్లో ఆరోగ్యానికి హాని కలిగించే పాదరసం, సీసం, కాడ్మియం, సెలీనియం, క్రోమియం వంటి అత్యంత విషపూరిత మూలకాలు ఉంటాయన్నారు. వ్యర్థాలను సరైన యాజమాన్య నిర్వహణ పద్ధతిలో రీసైకింగ్ చేయకపోతే పర్యావరణంతో పాటు మానవ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తొలుత నూతన పోలీసు కార్యాలయం నుంచి డీకేడబ్ల్యూ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ ఏఓ చంద్రమౌళి, ఆర్ఐలు, ఎస్‌బీ, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

- నెల్లూరురూరల్ : జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత ప్రతిజ్ఞ చేసి కార్యాలయంలోని ప్రతి విభాగంలో ఉన్న ఈ–వేస్ట్‌ను సేకరించారు. దీనిని సంబంధిత శాఖల వారు తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ ఉమామహేశ్వరి, డీపీఎంఓ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.
- నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గిరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి మనోజ్‌కుమార్, అధ్యాపకులు విజయభాస్కర్, గీత పాల్గొన్నారు.
- నెల్లూరు (పొగతోట) : స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో ఉద్యోగులు స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీఈఓ విద్యారమ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తీసేశారు. డీఆర్‌డీఏ, డీపీఓ, డ్వామా కార్యాలయాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.
- జిల్లా కలెక్టరేట్ పరిసరాలను డీఆర్వో ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తోడ్పడాలని సూచించారు.
- నెల్లూరురూరల్ : నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాసాహెబ్ మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు, పరిసరాల పరిశుభ్రత వల్ల చాలా వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. ఆస్పత్రి పరిపాలనాధికారిణి కళారాణి పాల్గొన్నారు.
- నెల్లూరు (వీఆర్సీసెంటర్) : నగరంలోని విద్యుత్ భవన్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నోడల్ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, ఈఈ, డీఈఈ, అసిస్టెంట్ ఇంజినీర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.



డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో..



డీఎం కార్యాలయంలో..



ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో..



విద్యుత్ భవన్‌లో..



డీఎంహెచ్ఓ కార్యాలయంలో..



ఈ-వ్యర్థాలతో అధికారులు